నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
5 | హైదరాబాద్, బుధవారం 10 జనవరి 2024 | SANGAREDDY

రంజోల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి సస్పెన్షన్

జహీరాబాద్, జనవరి 9 : రంజోల్ సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణిని సస్పెండ్ చేశారు. గురుకుల పాఠశాలల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారని మెదక్ పశ్చిమ ప్రాంతీయ అధికారి(ఆర్‌సీవో) భీమయ్య ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న జహీరాబాద్ మండలంలోని రంజోల్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న స్వప్న కళాశాలలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే విద్యార్థి మృతి చెందినట్లు విచారణలో తేలిందన్నారు. బాలిక మృతిపై సమగ్ర విచారణ చేసి సస్పెండ్ చేశారన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి హెడ్ క్వార్టర్స్ వదిలి బయటకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు: ఎస్పీ రూపేశ్

ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న ఎస్పీ

ఝరాసంగం, జనవరి 9: పోలీసులు విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, శాంతి భద్రతలు, ప్రజాభద్రత విషయంలో ఎలాంటి రాజీపడొద్దని ఎస్పీ రూపేశ్ అన్నారు. మంగళవారం ఝరాసంగం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నేర విషయాలు, స్టేషన్ రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పోలీస్ సిబ్బంది నివాస గృహాలను పరిశీలించి ఇవి ఉపయోగిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మండల పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల ప్రాముఖ్యత, ఇక్కడ జరిగే ఉత్సవాల గురించి తెలుసుకున్నారు. సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట జహీరాబాద్ డీఎస్పీ రఘు, రూరల్ సీఐ నోముల వెంకటేశం, ఎస్ఐలు రాజేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

న్యాల్‌కల్, జనవరి 9 : మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మండల జడ్పీటీసీ స్వప్నకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని టేకూర్ నుంచి తాట్‌పల్లి గ్రామానికి జిల్లా పరిషత్ నిధుల కింద రూ. 3లక్షలతో చేపడుతున్న ఫార్మేషన్ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విడుతల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అమీర్, మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు నర్సింహారెడ్డి, భాస్కర్, సంతోష్ పాటిల్, న్యాల్‌కల్ పీఎసీఎస్ డైరెక్టర్ అశోక్‌పాటిల్, శివకుమార్‌స్వామి, నవీన్‌పటేల్, సిద్ధయ్యస్వామి, వైజ్యనాథ్, అశోక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొల్లారం, జనవరి 9: 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ప్రభు త్వం నోటిఫికేషన్ ప్రకటించింది. 6వ తరగతి, 7నుంచి 10 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం ప్రవేశాలకు ఈనెల 12 నుంచి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బొల్లారం ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ శైలజ మంగళవాం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌సీ విద్యార్థులకు రూ.125, ఓసీ విద్యార్థుల ఫీజు రూ. 200 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ http://telanganams.cgg.gov.in చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 7న రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

వన భోజనాలు

నారాయణఖేడ్, జనవరి 9: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లోని ఆర్టీసీ డిపో వద్ద వన భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎం ప్రభులత హాజరై కార్మికులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆర్ఎం, కార్మికులతో ఆటపాటల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక డిపో మేనేజర్ మల్లేశయ్య, ఆర్టీసీ సీఐ నర్సింహులు, మెకానికల్ ఇంజినీర్ దశరథ్‌రావు, సూపర్‌వైజర్ అజీమ్, కార్మికులు నాగ య్య, నెహ్రూ, రాజు, కాశీరాం, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వివాహిత మృతి

నారాయణఖేడ్, జనవరి 9: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన నారాయణఖేడ్‌లో జరిగింది. నారాయణఖేడ్ పోలీసుల కథనం ప్రకారం.. ఐదేండ్ల క్రితం హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన అంజుంకు నారాయణఖేడ్‌కు చెందిన యూనూస్‌తో వివాహం జరిగింది. సోమవారం సాయంత్రం అంజుం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి అన్న మహ్మద్ పాషా నారాయణఖేడ్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, తన చెల్లెలి శరీరంపై గాయాలు ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీమా చెక్కు అందజేత

గుమ్మడిదల, జనవరి 9: ప్రమాదవశాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి మణికంఠ తాపీ మేస్త్రీ యూనియన్ ప్రమాదబీమా చెక్కును అందజేసింది. మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ సింగ్‌సునీల్ కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మాజీసీఎం కేసీఆర్ భవన రంగ కార్మికుల కోసం అమ లు చేసిన ప్రమాదబీమా రూ. లక్ష 30 వేలు మంజూరు కావడంతో మంగళవారం ఆ యూనియన్ సంఘం నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, యూనియన్ సభ్యులు, నాయకులు ఉన్నారు.

తీపి పండించే రైతుకు చేదు అనుభవం

- ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ మూసివేతతో చెరుకు రైతుల ఇక్కట్లు
- కర్ణాటకతోపాటు ఇతర ప్రాంతాల కర్మాగారాలకు చెరుకు తరలింపు
- అధికారంలోకి రాగానే చెరుకు రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్
- ట్రైడెంట్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించిన ప్రభుత్వం
- రూ.9 కోట్ల బిల్లులు పెండింగ్
- ఇబ్బందుల్లో అన్నదాతలు

జహీరాబాద్, జనవరి 9: జహీరాబాద్ ప్రాంతం చెరుకు సాగుకు పెట్టింది పేరు. 1972-73లో కొత్తూర్(బి) గ్రామంలో నిజాం చక్కెర ఫ్యాక్టరీని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రోజుకు 1250 టన్నుల చెరుకు క్రషింగ్ సామర్థ్యంతో ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఫ్యాక్టరీ జోన్ పరిధిలో జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్, మనూర్, రేగోడ్ మండలాలను తీసుకొచ్చారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన తర్వాత కొన్ని సంవత్సరాలు మంచిగానే నడిచింది. కార్మికుల సమస్య, యాజమాన్యం కొత్త యంత్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి ఏడాది క్రషింగ్‌లో సమస్య రావడంతో ఫ్యాక్టరీ నష్టాల్లోకి వెళ్లింది. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి నష్టాలపై విచారణకు ఆదేశించింది. కొత్తూర్(బి) గ్రామంలో ఫ్యాక్టరీకి 110 ఎకరాల భూమి ఉండేది.

విచారణ కమిటీ నివేదికతో 2002లో నిజాం చక్కెర ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసింది అప్పటి ప్రభుత్వం. ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కావడంతో చెరుకు రైతులకు కష్టాలు మొదలయ్యాయి. నిజాం చక్కెర ఫ్యాక్టరీ ప్రస్తుతం ట్రైడెంట్ కర్మాగారంగా కొనసాగుతున్నది. ట్రైడెంట్ యాజమాన్యం రెండేండ్లుగా నష్టాల పేరుతో విలువైన ఫ్యాక్టరీ భూములను అమ్ముతున్నది. కేసీఆర్ ప్రభు త్వం ఫ్యాక్టరీపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించి, ఆస్తులు వేలం వేసి రైతులకు బకాయిలు చెల్లించింది. కాగా, 2022-23లో క్రషింగ్ చేసిన రైతులకు ఇప్పటివరకు రూ. 9 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీంతో ఫ్యాక్టరీ ఆస్తులు వేలం వేసేందుకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో యాజమాన్యం కోర్టుకు పోవడంతో సమస్యగా మారిపోయింది. ఈనెల 20న కోర్టు తీర్పు వస్తుందని చెరుకు అభివృద్ధి అధికారులు తెలుపుతున్నారు.

జహీరాబాద్‌లో అధికంగా చెరుకు సాగు

జహీరాబాద్ ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో పరిధిలో 11 వేల హెక్టార్లలో చెరుకు పంటను రైతులు సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గతంలో ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు పంటను అగ్రిమెంట్ చేసుకొని బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించే వారు. కొందరు రైతులు చెరుకు పంటను సాగు చేసిన చెక్కెర కర్మాగారానికి అగ్రిమెంట్ చేయరు. క్రషింగ్ సీజన్‌లో ఎక్కడ ఎక్కువ ధర ఉంటే ఆ పరిశ్రమకు చెరుకును తరలిస్తారు. ఒక ఎకరా చెరుకును పొలంలో సాగు చేయాలంటే రైతు రూ.50 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎరువుల ధరలు, కూలీ ఖర్చులు సైతం పెరిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జహీరాబాద్ చెరుకు రైతులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ట్రైడెంట్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని రైతులకు మద్దతు ధర ఇప్పిస్తామన్నామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల రోజులు గడిచినా ఇంతవరకు చెరుకు రైతుల పెండింగ్ బిల్లులను ట్రైడెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లించలేదు.

ముడి సరుకుతో కర్మాగారాలకు లాభం

చక్కెర ఫ్యాక్టరీలు అమ్మకాల్లో లాభాలను రైతులకు పంచాలి, కానీ ఎక్కడా అమలుకావడం లేదు. చెరుకు గానుగతో వచ్చే వ్యర్థ పదార్థాలు, మొలాసిస్, బెగాస్‌కు మార్కెట్‌లో మంచి ధర ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెపుతున్నారు. ఈ వ్యర్థాల ధరకు సమానమైన ధర తమకు ఇవ్వాలని చెరుకు రైతులు డిమాండ్ చేసినా యాజమాన్యం రైతులకు ఎలాంటి లాభాలు ఇవ్వడంలేదు. కేంద్రం ప్రకటించే మద్దతుధర పూర్తిగా పరిశ్రమ యజమానులకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 40-50 టన్నుల దిగుబడి వస్తుంది. చెరుకు ఏడాది పంట. ఏడాదిలో రెండు సార్లు సాగు చేస్తారు. ఒక ఎకరా చెరుకు పంట సాగు చేయాలంటే రైతులు రూ.50 వేల వరకు ఖర్చు చేస్తారు. చక్కెర ఫ్యాక్టరీలు రైతులకు ఇచ్చే మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022-23 సీజన్‌లో 10.97 శాతం రికవరీపై రూ.3,269 టన్నుకు మద్దతు ధర ప్రకటించారు.

చెరుకు రైతు బతుకు చేదెక్కింది..

చెరుకు సాగుకు పెట్టుబడులు పెరిగిపోవడం, చక్కెర పరిశ్రమ యాజమాన్యం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం, ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరుకు పండించిన రైతులు క్రషింగ్ కోసం కర్ణాటక, మహారాష్ట్ర, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఫ్యాక్టరీలకు చెరుకు సరఫరా చేశారు. అక్కడి ఫ్యాక్టరీలు మద్దతు ధర పెంచకపోవడంతో రైతులకు పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొంది. చెరుకు సాగుకు పెట్టుబడులు పెరిగినా, మద్దతు ధర లేకపోవడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్ (బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగారం యాజమాన్యం 2022-23లో మద్దతు ధరను టన్నుకు రూ.3269 ప్రకటించింది. ఈ మద్దతు ధర గిట్టుబాటు కాదని రైతులు ఆందోళన చేశారు. గత సీజన్‌లో కొత్తూర్(బి) ట్రైడెంట్ ఫ్యాక్టరీలో 2,07,288.88 టన్నుల చెరుకును క్రషింగ్ చేసింది. ట్రైడెంట్ ఫ్యాక్టరీ జోన్‌లో 8,568 మంది రైతులు చెరుకు పంటను సాగు చేశారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ

ఖజానా పెంచి పథకాలు విడతలుగా అమలుచేస్తాం

- అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

కల్హేర్ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, జనవరి 9: ఖజానాను పెంచి ప్రభుత్వ పథకాలను విడుతల వారీగా అమలు చేస్తామని, అవినీతి, అక్రమాలకు పాల్పడే అధికారులకు కఠినచర్యలు తప్పవని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఎంపీపీ సుశీల అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారు పరిష్కరించని సమస్యలను తనదృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతలోపిస్తే చర్యలు తప్పవన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆదేశించారు. వ్యవసాయ రైతులు అధికంగా ఉన్నారని నూతన వంగడాలు, ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణపై అధికారులు అవగాహన కల్పించాలని, వారంలో రెండూ రోజులు రైతువేదికలో సమావేశం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ దవాఖానలో ల్యాబ్ టెక్నీషియన్ పేషెంట్లతో దురుసుగా మాట్లాడుతాడని, రక్త పరీక్ష చేస్తే రూ. 50 తీసుకుంటారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఆలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, వైస్ఎంపీపీ నారాయణరెడ్డి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అలీ, తహసీల్దార్ బాలాశంకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో శంకర్‌తోపాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కొండాపూర్,జనవరి 9 : మండలకేంద్రం కొండాపూర్‌లో మంగళవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే పథకాన్ని కొనసాగిస్తూ ప్రజలను ఆదుకునేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటప్రకారం తులం బంగారాన్ని కూడా లబ్ధిదారులకు అందించాలని కోరారు. కొండాపూర్ మండలానికి చెందిన 50మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రుక్ముద్దీన్, జడ్పీటీసీ పద్మావతీపాండురంగం, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, ఎంపీపీ మనోజ్‌రెడ్డి, తహసీల్దార్ అనిత, ఎంపీడీవో మధులత, నాయబ్ తహసీల్దార్ ప్రదీప్, ఆర్ఐ రాజు, బీఆర్ఎస్ నాయకులు మల్లాగౌడ్, సత్యనందం, శ్యాంరావు, గురుకిరణ్, శేఖర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మార్కెట్ కమిటీ స్టడీ టూర్

పటాన్‌చెరు, జనవరి 9: పటాన్‌చెరు మార్కెట్ కమిటీ స్టడీ టూర్‌కు బయలుదేరింది. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో కమిటీ సభ్యుల స్టడీటూర్ బస్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్ సమీపంలో పలు మార్కెట్లను కమిటీ పరిశీలిస్తుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్క రాష్ట్రాల్లోని ఉత్తమ మార్కెట్లను పరిశీలించి ఇక్కడ అమలుచేసేందుకు కృషి చేయాలన్నారు. స్టడీటూర్‌తో మార్కెట్ అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

స్టడీ టూర్‌కు వెళ్తున్న మార్కెట్ కమిటీ సభ్యుల బస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

భావి శాస్త్రవేత్తల ఆలోచనలు అద్భుతం

- రెండోరోజు ఎగ్జిబిషన్‌కు క్యూకట్టిన విద్యార్థులు
- బాల వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించిన ఎస్పీ రూపేశ్
- నేటితో ముగియనున్న సైన్స్ ఫెయిర్

ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8: విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టారు. జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ఎగ్జిబిట్లు ప్రదర్శించి ప్రతిభను చాటారు. శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా మంగళవారం రెండోరోజు జిల్లాలోని 55 పాఠశాలల నుంచి 6,200 మంది విద్యార్థులు ప్రదర్శనలు తిలకించేందుకు వచ్చారు. ఆయా ఎగ్జిబిట్లను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. ఒక్కో విద్యార్థి ఒక్కో ఉపఅంశాన్ని సందర్శకులకు చక్కగా వివరించారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ బాల వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను తిలకించిన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలను ఎస్పీ అభినందించారు. న్యాయనిర్ణేతలు రాష్ట్రస్థాయికి ప్రాజెక్టులను ఎంపిక చేసేందుకు ఆయా ప్రదర్శనలను క్షుణ్ణంగా పరిశీలించారు. సైన్స్ ప్రదర్శన చివరిరోజున విజేతలను వారు ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఆయా ఉపాధ్యాయ సం ఘాల నాయకులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎగ్జిబిట్లను తిలకిస్తున్న విద్యార్థులు

108 హనుమాన్ విగ్రహానికి చందనోత్సవం

సంగారెడ్డి, జనవరి 9 : 108 ఆంజనేయ స్వామి విగ్రహాలకు పూజలు చేస్తే అనుకున్నవి జరుగుతాయనే నమ్మకంతో రాము గురుస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్ మండలాల్లో హనుమంతుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం పట్టణంలోని కిందిబజార్‌లో మహబూబ్‌సాగర్ చెరువు కట్ట కింద ఉన్న సంగారెడ్డి-జోగిపేట్ రహదారిపై కొలువుదీరిన భారీ హనుమంతుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పూజలు చేశారు. కార్యక్రమంలో సదాశివపేట గురుస్వామి సుదర్శన్‌గౌడ్, సంగారెడ్డి గురుస్వాములు జయప్రకాశ్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, విశ్వనాథరావు, పరమేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఉపాధి పనులపై ప్రజావేదిక

సిర్గాపూర్, జనవరి 9 : గ్రామాల్లో ఉపాధి హామీ పనులతో గ్రామాలు అభివృద్ధి చెందడమే కాకుండా కూలీలకు వేతనం లభిస్తుందని జిల్లా అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు అన్నారు. మంగళవారం సిర్గాపూర్ ఎంపీపీ ఆఫీసు ఎదుట ఈజీఎస్ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 2022 మార్చి 31 నుంచి 2023 మార్చి 31వరకు మొత్తం ఈజీఎస్ రూ. 3.15కోట్లు కూలీలకు వేతనాలు చెల్లించగా, రూ. 1.64కోట్లు మెటల్ కాంపోనెంట్ కింద అభివృద్ధి పనులు చేపట్టారు. దీనిపై వారం కిందట డీఆర్పీలు గ్రామాల్లో సోషల్‌ఆడిట్ విచారణ చేపట్టారు. వారి నివేదికలను అనుసరించి ప్రజావేదికలో డీఆర్పీలు చదవడంతో వీటిపై అధికారులు సమీక్షించారు. చిన్నచిన్న లోపాలు, హాజరు లేకుండా పని వేతనాలు చెల్లించడం వంటి తప్పిదాలు జరిగాయి. వీటిపై సంజాయిషీ తీసుకున్నారు. ఇందులో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ఏపీడీ రాజు, ఎంపీడీవో సుజాత, ఏపీవో బస్వరాజ్, ఎంపీవో బ్రహ్మం, ఈసీ, తనిఖీ బృందం, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

కోహీర్, జనవరి 9 : రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆర్డీవో వెంకారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కోహీర్‌లోని తహసీల్ కార్యాలయాన్ని ఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ దరఖాస్తుదారులకు కుల, ఆదాయ, తదితర ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. నిర్ణీత సమయంలో వాటిని అందించాలన్నారు. ఓటరు జాబితాల నుంచి మృతి చెందిన వారి పేర్లను తొలిగించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు

సంగారెడ్డి అర్బన్, జనవరి 9: గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రమేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. పుల్కల్ మండ లం మిన్‌పూర్‌తండాకు చెందిన జెరుపుల శ్రీను, పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన వడ్డె అశోక్, మిన్‌పూర్ తండాకు చెందిన రమావత్ అనిల్, జహీరాబాద్ మండలం మల్‌చల్మ తండాకు చెందిన బోనాతు శ్రీను, నాగలిగిద్ద మండ లం మైనెల్లితండాకు చెందిన రాథోడ్ రవీందర్, రాథోడ్ హరిగహిరన్ తండా, కర్ణాటకకు చెందిన మోహన్, మిన్‌పూర్‌కు చెందిన బేగరి నర్సింహులు కలిసి మోహన్ అనే వ్యక్తి ద్వారా ఒడిశా, భద్రాచలం నుంచి ఏవోబీ బార్డర్ నుంచి గంజాయిని తీసుకువచ్చే వారన్నారు. ఇస్నాపూర్, జహీరాబాద్, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లోని కంపెనీల్లో పనిచేసే వారికి గంజాయిని విక్రయించేవారన్నారు. ఈనెల 8న శ్రీను, అశోక్ బైక్‌పై పట్టణంలోని కిందిబజార్ సమీపంలో గంజాయిని తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి 600గ్రాముల గంజాయి, నలుగురు నిందితుల నుంచి నాలుగు మోటరు సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చగా 14రోజులు రిమాండ్ విదించడంతో సంగారెడ్డి జైలుకు తరలించారు. పరారీలో ఉన్న మిగతా వారి కోసం నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి, సంగారెడ్డి రూరల్ సీఐ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.